క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

నిడదవోలు : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0లో భాగంగా ఎన్టీఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో బస్టాండ్ వద్ద ఉన్న సచివాలయంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

నేడు అధికారులతో పరిచయ కార్యక్రమం

కొవ్వూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ఉదయం పది గంటలకు ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావుతో మండలంలోని ప్రభుత్వ అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు వలంటీర్లకు వందనం

తాళ్లపూడి: వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు తాళ్లపూడి పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ టీబీ వెంకటరమణ తెలిపారు. గోపాలపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఇన్‌చార్జి తలారి వెంకటరావు చేతులమీదుగా వలంటీర్లకు సేవా మిత్ర, వజ్ర, రత్న అవార్డుతో సత్కరించనున్నట్టు తెలిపారు. అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వలంటీరు, నాయకుల్లు కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

దేవరపల్లి: దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన మంచినీటి బోరు పూడుకుపోవడంతో పంచాయతీ నిధులు రూ.7 లక్షల వ్యయంతో పంచాయతీ ఆవరణలో కొత్తగా బోరు నిర్మాణం చేపట్టినట్టు దేవరపల్లి సర్పంచ్ కడిమి వీర కుమారి తెలిపారు. బోరు నిర్మాణానికి మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెలగా సాంబశివరావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కడిమి రాజు, పార్టీ నాయకులు పచ్చా రాంగోపాల్, సిద్దా సూర్యారావు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

నల్లజర్ల: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజరు తవిటి నాయుడు సూచించారు. క్రీడాపరికరాల రిటైలర్ సంస్థ(విజయవాడ)డెకోథ్లాన్ దూబచర్లలో మంగళవారం క్రీడలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ శిబిరాన్ని బ్యాంకు మేనేజరు ప్రారంభించారు. సైక్లింగ్ కోచ్ ఓంసాయి ప్రకాష్, మౌంటెన్ స్పోర్ట్స్ కోచ్ దుష్యన్ సింగ్, సీఆర్ఎం రెఫరెంట్ జి.నాగార్జున, టి.సుభాషిత, ఎం.మణికుమార్, వై.శ్రీనాథ్, ఎం.చైతన్య పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాసరావు, నెక్కంటి వెంకటేష్, రవికృష్ణ, గిరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ మన బాధ్యత

చాగల్లు: హిందూ సంస్కృతి, ధర్మాలను పరిరక్షించడం మన బాధ్యతని భారత హిందూ పరిరక్షణ సమితి నాయకులు దోర్బల ప్రభాకర శర్మ అన్నారు. చాగల్లులో పాటమ్మ తల్లి కల్యాణ మండపంలో మంగళవారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా మందిర అర్చక పురోహితుల ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు లింగాల శ్రీనివాస శర్మ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రాంత మందిర అర్చక పురోహితు ప్రముఖులు వీబీఎస్ఎస్ శాస్త్రి, రెండు ప్రాంతాల మందిర అర్చక పురోహిత్ ప్రముఖ్ శివశంకర్ విశ్వహిందూ పరిషత్‌కి సత్సంగాలు బాల సంస్కార కేంద్రంలో నిర్వహణ విధానాన్ని తెలియజేశారు. ఈ సమావేశానికి 14 మండలాలు నుంచి అర్చక పురోహితులు విచ్చేశారు. ప్రాంత గోరక్ష ప్రముఖ్ మెట్టపల్లి సుబ్బారాయుడు, రాజమహేంద్రవరం విభాగ్ సంఘటన మంత్రి సీహెచ్ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గంగాధర్, సహకార్యదర్శి కందికుప్ప వెంకట రామారావు, జిల్లా కోశాధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పదింతల ప్రణాళికతో..

- ప్రతిరోజూ పునశ్చరణ తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు
- నిడదవోలు నియోజకవర్గంలో 3,700 మంది పైగా విద్యార్థులు హాజరు



కోరుమామిడిలో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

నిడదవోలు రూరల్: ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి దశ దిశ నిర్దేశిస్తుంది. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఆకాంక్ష విద్యార్థుల్లోనే కాకుండా ఉపాధ్యాయుల్లోనూ బలంగా ఉంటోంది. ఇందుకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ బృందం పట్టుదలతో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. దీనికి అనుగుణంగానే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచి అత్యుత్తమ ఫలితాలను సాధించడమే లక్ష్యంగా పునఃశ్చరణ (రివిజన్) తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో సాధించిన ప్రతిభతోనే ట్రిపుల్ ఐటీ సీట్లు రావడం, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇంటర్ ప్రవేశాల్లో రాయితీలు లభించడం ఉంటాయి. నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండల్లాలోని 38 ఉన్నత పాఠశాలలు, 18 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,700 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. మార్చి 18 నుంచి జరిగే పబ్లిక్ పరీక్షలకు సబ్జెక్టుల వారీగా పరీక్షలను నిర్వహించి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులు

పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా ప్రతి పాఠశాలలో 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8.30 గంటల నుంచి 9.30, సాయంత్రం 4.50 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో 22 భాగాలు, మిగిలిన సబ్జెక్టుల్లో 11 విభాగాలుగా విభజించి సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. తరగతి గదిలో బోధించిన పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థంకాని అంశాలను బోధిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు. క్లిష్టమైన సబ్జెక్టులపై భయం లేకుండా పరీక్ష రాసే విధానాన్ని వివరిస్తున్నారు. రాత్రి సమయంలో కనీసం 9 గంటల వరకైనా విద్యార్థులంతా ఇళ్ల వద్ద చదివేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల ద్వారా పోటీతత్వం పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఈనెల 23 నుంచి ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, డిసెంబర్ నాటికే సిలబస్‌ను పూర్తి చేశామని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.



భయం పోయి.. పోటీతత్వం పెరిగి..

పదో తరగతి విద్యార్థులకు సాధారణంగా లెక్కలు, ఇంగ్లీష్, హిందీ అంటే భయం. దీంతో ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా బోధిస్తున్నారు. ఎక్కువ సమయం చదవడానికి, ఇంటి వద్ద కంటే తోటి విద్యార్థులతో కలిసి చదవడం వల్ల ఆ భయం పోయింది. ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని పోటీతత్వం పెరిగింది. ప్రత్యేక తరగతులు మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. తరగతి గదిలో వచ్చిన సందేహాలను సాయంత్రం ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం.

– అన్వర్ భాషా, విద్యార్థి, కోరుమామిడి

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు పునశ్చరణ తరగతులు అమలు చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా విద్యార్థులు పరీక్షలకు పూర్తిగా సన్నద్ధమవుతున్నారు. ఉత్తమ ఫలితాలను సాధిస్తాం. ఉదయం 8 గంటలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం 6 గంటల తిరిగి ఇంటికి వెళతారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించి మరోసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విజయఢంకా మోగిస్తారు. అందరు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

– వెలిగట్ల లక్ష్మి, ప్రధానోపాధ్యాయిని, కోరుమామిడి

వెంకటేశ్వరావుకు పురస్కారం



కొల్లి వెంకటేశ్వరావుకు పురస్కారం అందజేస్తున్న అసెంబ్లీ స్పీకర్ శ్రీరామ్‌నివాస్ గోయల్

నల్లజర్ల: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరానికి చెందిన డాక్టరు కొల్లి వెంకటేశ్వరావు కర్ణాటక రాష్ట్రంలో హాసన్‌లో మల్నాడు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23న భారత్ సన్మాన్ నిధి పురస్కార్–2024 అందజేసింది. ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ శ్రీరామ్‌నివాస్ గోయల్ చేతుల మీదుగా బెస్ట్ రీసెర్చ్ స్కాలర్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రశంసాపత్రం, జ్ఞాపిక తీసుకున్నారు. ఈ సందర్భంగా పోతవరం కొత్తపేటలో యువకులు ఆనందం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- పుచ్చ, కర్బూజ సాగుపై ప్రత్యేక దృష్టి
- ఎకరానికి 18–20 టన్నుల దిగుబడి
- రైతును అభినందించిన జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



రైతు ప్రసన్నకుమార్‌ను అభినందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నల్లజర్ల: సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. సస్య రక్షణ చర్యలు అవలంబించి పుచ్చ, కర్బూజ సాగు చేస్తున్న నల్లజర్లకు చెందిన యువ రైతు ప్రసన్నకుమార్ అధిక ఆదాయం పొందుతున్నారు. నల్లజర్ల పరిసర ప్రాంతంలో 20 ఎకరాలలో పుచ్చ, 5 ఎకరాలలో కర్బూజ సాగు చేస్తున్నారు. ఈ సాగును జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్,మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రైతు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పుచ్చ నల్ల రకం సన్‌స్టార్ సీడ్స్ వారి నుంచి స్టార్‌కింగ్ 99 రకం వేసినట్టు వివరించారు. చారపుచ్చ(కృషాన్)రకం వేసినట్టు చెప్పారు. మల్చింగ్ షీటు వేయడం ద్వారా కలుపు వచ్చే అవకాశం ఉండదన్నారు. కాయ నాణ్యతగా ఉంటుందన్నారు. సమగ్ర వ్యవసాయ పద్ధతుల ద్వారా పంట అధిక దిగుబడి వచ్చిందన్నారు. ఎకరాలకు 18 టన్నుల నుంచి 20 టన్నుల వరకు దిగుబడి వచ్చిందన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా తేజ ఆగ్రోఏజెన్సీ పేరిట లైసెన్స్ తీసుకొని ఒక పక్క వ్యవసాయం చేస్తూనే మరో పక్క రైతులకు నాణ్యమైన విత్తనాలు, నీటిలో కరిగే ఎరువులు ఐపీఎం పద్ధతుల ద్వారా సంవత్సరానికి 15 వేల టన్నుల పుచ్చ పంటను ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నట్టు చెప్పారు. నాణ్యమైన ఉత్పత్తులను రిలయన్స్, మోర్, స్పెన్సర్స్, బిగ్‌బాస్కెట్ వంటి హైపర్‌మార్కెట్లకు సరఫరా చేస్తున్నట్టు వివరించారు. పరోక్షంగా 150 మందికి ఉపాధి చూపుతునట్టు చెప్పారు. ఈ సందర్భంగా తేజ అగ్రోజెన్సీ కార్యాలయంలో రైతు యం.ప్రసన్నకుమార్‌ను వ్యవసాయ అధికారుల బృందం అభినందించింది.

నిడదవోలు మున్సిపల్ కమిషనర్‌గా రాంభూపాల్‌రెడ్డి



నిడదవోలు : సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా నిడదవోలు మున్సిపల్ కమిషనర్‌గా టి.రాంభూపాల్‌రెడ్డి బదిలీపై రానున్నారు. గుంటూరు జిల్లా రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న టి. రాంభూపాల్‌రెడ్డి బదిలీపై ఇక్కడకు రానున్నారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న నిడదవోలు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ పార్వతీపురం జిల్లా పార్వతీపురం పురపాలక సంఘానికి బదిలీ అయ్యారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ



బి.శ్రీకాంత్

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ బాపట్లకు బదిలీ అయ్యారు. ఈయన 2022 సెప్టెంబర్ 12న ఇక్కడ విధుల్లో చేరారు. కొవ్వూరు కమిషనర్‌గా ఇంకా ఎవర్ని నియమించలేదు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన కబడ్డీ జట్టుతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పురుషుల కబడ్డీ జట్టును మంగళవారం ఎంపిక చేసినట్టు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమలరెడ్డి శ్రీకాంత్ తెలిపారు. తణుకు మండలం మండపాకలో ఈ ఎంపికలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు వంద మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో 14 మందిని ఎంపిక చేసినట్టు చెప్పారు. స్కూల్ గేమ్స్ సెక్రటరీ మల్లేశ్వరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్యనారాయణ, ఆర్గనైజర్ బి.ప్రవీణ్, కొమ్మటి రంగారావు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. ఎంపికైన జట్టు మార్చి 3, 4, 5 తేదీలలో విశాఖలో జరుగనున్న 70 పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఎంపికైన కబడ్డీ జట్టు క్రీడాకారుల వివరాలు

టి.వి.యూ.వెంకటేష్(తోలేరు), టికేఎస్ఆర్ తేజ (తోలేరు), యస్.సన్నీ(మండపాక), జి.శ్రీకాంత్(అనంతపల్లి), ఎ.ఆనంద్(భీమవరం), కే.దిలీప్(చిక్కాల), పి.సచిన్(యల్లమిల్లి, ఎస్.కార్తీక్(మాధవరం), ఎస్‌కే బాబా మస్తాన్(పైడిపర్రు), కె.అభిలాష(మండపాక), పి.పోలబాబు(బుట్టాయిగూడెం), పి.ఫణికుమార్(వీరవాసరం), పి.శ్రీనివాస్.పోడూరు), ఐ.సునిల్(తణుకు).

200 మందికి వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: లయన్స్ క్లబ్ మైత్రి తణుకు ఆధ్వర్యంలో కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ తండ్రి నానాజీ జ్ఞాపకార్థం మండలంలో సూర్యారావుపాలెం గ్రామంలో సొసైటీ వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబరాన్ని సర్పంచ్ మెండే లలిత కుమారి ప్రారంభించారు. కంటి, షుగర్, బీపీ, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, గొంతు పరీక్షలకు సంబంధించి 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి సమస్యలకు సంబంధించి 100 మందికి పరీక్షలు నిర్వహించగా, 40 మందికి కళ్లజోళ్లు, 21 మందికి ఆపరేషన్లకు రిఫర్ చేశారు. జనరల్ పరీక్షల సంబంధించి 102 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గమిని గోపాలకృష్ణ, అక్కాబత్తుల బాలాజీ, ఐ.నాగకృష్ణంరాజు, మెండే శ్రీనివాసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రేపు నిరాహార దీక్షలు

కొవ్వూరు: సంక్షేమ బోర్డు నిధుల ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ఈనెల 28, 29 తేదీల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దుకూరి దొరయ్య, ఎం.సుందరబాబులు కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా కార్మికుల పని ప్రదేశాల్లో పర్యటించి విస్తృత ప్రచారం నిర్వహించామన్నారు. పలు సమస్యలను పరిష్కరించాలన్నారు. రేఖా నాగేశ్వర రావు, ర్యాలీ బ్రహ్మానందం, జొన్నల రాంబాబు, అప్పన కృపాదాస్, రాజన్న నాయుడు, మద్దిపాటి హనుమంతు, మానికిరెడ్డి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి ఎస్సై శ్రీహరిరావుకు ఎస్పీ అభినందన



ఎస్సై శ్రీహరిరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

దేవరపల్లి: జంగారెడ్డిగూడెం నుంచి భీమవరం వెళుతున్న నగల వ్యాపారిని దుండగలు నల్లజర్ల సమీపంలో వాహనాన్ని అడ్డగించి 3.5 కిలోల పసిడి, రూ.5 లక్షల నగదు దోసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరిరావు కీలకపాత్ర పోషించి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఎస్సైను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ జగదీష్ మంగళవారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

తాళ్లపూడి: ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం, ప్రలోభాలకు గురి చేయడం వంటివి చేస్తే వారిపై చర్యలు ఉంటాయని తహసీల్దార్ శ్రీనివాసరావు హెచ్చరించారు. రాజకీయపార్టీల ప్రతినిధులు అందరినీ సమాయత్తం చేయాలని, కొత్త ఓట్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. తాళ్లపూడి మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్ శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన ప్రచురితమైన ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిచేసుకోవచ్చన్నారు. కొత్త ఓటర్లను నమోదు చేసుకోవచ్చని, పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు గురి చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుంది అని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న వేగేశ్వరపురం, తిరుగుడు మెట్ట, మలకపల్లి గ్రామాలలో పోలీసు బలగాలు అదనంగా ఉంటాయి అని అన్నారు. ఇబ్బంది కర పరిస్థితులు కల్పిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నుంచి యాళ్ల బాబూరావు, జనసేన పార్టీ నుంచి ఐతం మణికంత, బీజేపీ నుంచి ఇండుగుల రామకృష్ణ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.